

# నేడు 'ఎక్స్‌పీరియం'కు సుందరీమణులు

## పర్యావరణ పరిరక్షణలో భాగంగా సందర్శన

చేవెళ్ల రూరల్, మే 15 : చేవెళ్ల నియోజక వర్గం శంకర్‌పల్లి మండల పరిధి ప్రొద్దటూరు గ్రామ రెవెన్యూలోని ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కును శుక్రవారం మిస్ వరల్డ్ - 2025 పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన వివిధ దేశాల సుందరీమణులు సందర్శించనున్నారు. ఇటీవల ప్రారంభమైన ఈ పార్కులో 85 దేశాల నుంచి తీసుకువచ్చి పెంచుతున్న వివిధ రకాల వృక్షాలు, పార్కు అందాలను శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు తిలకించనున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతోపాటు రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

# కల్యాణలక్ష్మి లాంటి పథకం ఏడా లేదు

- మహిళలు కేంద్రబిందువుగా బీఆర్ఎస్ హయాంలో పథకాలు
- మేనిఫెస్టోలో లేని పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌ది
- సీఎం రేవంత్ మాటలు విడ్డూరంగా ఉన్నాయి
- కోసుకు తినండి, కొరుక్కు తినండి అని సీఎం స్థాయి వ్యక్తి అనొచ్చా..
- మహేశ్వరంలో చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే సబితారెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేసినఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్ : ప్రపంచంలో ఎక్కడా లేని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలను మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మహేశ్వరంలో గురువారం నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ఎవరు అడగకుండానే మహిళలు, ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన చరిత్ర కేసీఆర్‌ది అన్నారు. మేనిఫెస్టోలో లేని పథకాలను కూడా ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. తల్లీబిడ్డ సురక్షితంగా ఉండాలన్న ఉద్దేశంతో కేసీఆర్ కిట్టు తీసుకురావడం జరిగిందన్నారు. ఆసుపత్రి నుంచి ఇంటికి పోయేవరకు ప్రభుత్వ ఖర్చుల ద్వారానే పంపడం జరిగిందన్నారు. అలాంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడం బాధాకరమన్నారు. కేసీఆర్ కిట్టును వెంటనే పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఆడబిడ్డలు బిందెలు తీసుకొని రోడ్లపైకి రాకుండా ఉండటానికి మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి మంచినీళ్లు ఇచ్చామన్నారు. రైతుల కోసం రైతుబంధు ప్రవేశపెట్టామని.. బీఆర్ఎస్ హయాంలో రైతు బంధు రాలేదన్న ఒక్క రైతును చూపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు బంద్‌దై పోయిందన్నారు. కల్యాణ లక్ష్మితోపాటు తులం బంగారమిస్తామని వాగ్దానం చేసి 500 రోజులవుతున్నా ఎందుకు అమలు చేయడంలేదో సమాధానం చెప్పాలన్నారు.

### సీఎం స్థాయి వ్యక్తి అలా మాట్లాడవచ్చా..

రాష్ట్ర పరిస్థితి బాగాలేదని, అప్పులు ఎవరూ ఇవ్వడంలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారన్నారు. దొంగలుగా చూస్తున్నారని, చెప్పులెత్తుకుపోయే వాళ్లు వస్తున్నారని, ఎవరు అపాయింట్మెంట్లు ఇవ్వటంలేదని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కొరుక్కొని తినండి, కాల్చుకొని తినండి అని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి అనడం మంచి పద్ధతి కాదన్నారు. సీఎం స్థాయిలో ఉండి రాష్ట్రం దివాలా తీసిందని చెప్పడం దేనికి నిదర్శనమన్నారు. భవిష్యత్‌లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, పీఓపీఆర్డీ రవీందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ పాండుయాదవ్, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, వైస్ చైర్మన్ యాదయ్య పాల్గొన్నారు.



# నేడు కలెక్టరేట్‌లో పెన్షన్ అదాలత్

## రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, మే 15 : పెన్షనర్లు, పెన్షన్ అసోసియేషన్‌వారు పెన్షన్ల సమస్యలపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవడానికి శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పెన్షన్ అదాలత్ ఏర్పాటు చేస్తున్నామని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లాలోని పెన్షనర్లు తమ సందేహాలను అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఆడిట్ జనరల్ సిబ్బంది పాల్గొని జీపీఎఫ్ కేసులకు సంబంధించి కూడా ఈ అదాలత్‌లో పరిష్కారం చూపుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించే వర్క్‌షాప్‌లో పెన్షన్, జీపీఎఫ్ అకౌంట్స్ సమస్యలపై జీపీఎఫ్ ఫైనల్ చెల్లింపుల గురించి తెలియజేస్తారని తెలిపారు. జిల్లాకు సంబంధించిన డీడీవోలు, అకౌంట్స్ ఆఫీసర్లు సదస్సుకు హాజరవుతారని కలెక్టర్ చెప్పారు.

# 17న జాబ్ మేళా

వికారాబాద్, మే 15 : గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత వసతితో కూడిన శిక్షణ, ఉద్యోగావకాశం ఎంఆర్ఎఫ్ ప్రైవేట్ లిమిటెడ్ (సదాశివపేట, ఎన్కెపల్లి)లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి షేక్ అబ్దుస్ సుభాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, ఐటీఐ క్యాంపస్ లో మే 17న ఉదయం 10:30 గంటలకు జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కంపెనీలో సుమారు 200 మందికి డెవలప్ ది స్కిల్ ఇన్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆపరేషన్స్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించబడుతాయన్నారు. ఈ ఉద్యోగానికి 18 నుంచి 24 ఏండ్ల లోపు ఉన్న నిరుద్యోగ యువత అందరూ అర్హులని తెలిపారు. ఈ ఉద్యోగానికి పదవ తరగతి ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. జాబ్ మేళా ద్వారా ఎంపికయిన వారికి ఉచిత వసతితో కూడిన శిక్షణ, ఉద్యోగ అవకాశం కల్పించబడునని సూచించారు. ఇతర వివరాలకు జాబ్ మేళా నిర్వాహకుడు మియాసాబ్ నం.9676047444 ను సంప్రదించాలని ఆయన సూచించారు.

# ఆత్మగౌరవాన్ని మంటగలుతారా..?

## పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్

కులకచర్ల, మే 15 : విదేశీ సుందరీమణుల కాళ్లను తెలంగాణ ఆడబిడ్డలతో కడిగించడం తెలంగాణ ప్రభుత్వానికి తగదని.. దీన్ని తెలంగాణ ప్రజలు క్షమించరని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ ఖండించారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి కాంగ్రెస్ ప్రభుత్వం భంగం కలిగిస్తున్నదన్నారు. దళిత, గిరిజన మహిళలను బానిసలుగా చూస్తారా..? వారి ఆత్మగౌరవాన్ని మంటగలుపుతారా అని ప్రశ్నించారు. తెలంగాణ సంప్రదాయాలను గౌరవించాలి తప్పా అవమానకరంగా వ్యవహరించకూడదని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే క్షమాపణలు చెప్పి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచ అందగత్తెల పోటీల పేరుతో తెలంగాణ మహిళలతో విదేశీ మహిళల కాళ్లు కడిగించడం కాంగ్రెస్ ప్రభుత్వ బానిసత్వానికి, మహిళలపై ద్వేషభావానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.



అమ్డాపూర్ రోడ్డులో విరిగిన స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని నిలబెడుతున్న విద్యుత్ సిబ్బంది

# గాలివానతో అస్తవ్యస్తం

- నేలకూలిన వృక్షాలు.. విరిగిన విద్యుత్ స్తంభాలు
- 24 గంటలపాటు నిలిచిన విద్యుత్ సరఫరా
- ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరైన జనం
- కొత్త స్తంభాన్ని నెలకొల్పిన అధికారులు

మొయినాబాద్, మే 15 : బుధవారం సాయంత్రం కురిసిన గాలివానతో మొయినాబాద్ మండల పరిధిలోని అమ్డాపూర్ రోడ్డుకు పక్కన ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలపై భారీ వృక్షం విరిగిపడగా.. స్తంభం విరిగింది. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో 24 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోగా ప్రజలు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. అధికారులు స్పందించి కొత్త స్తంభాన్ని నెలకొల్పి సరఫరాను పునరుద్ధరించారు. అలాగే మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహిళా సమాఖ్య భవనం వద్ద వేప చెట్టు విరిగి కరెంట్ తీగలపై పడటంతో తీగలు తెగిపోయి సరఫరా నిలిచిపోయింది. పరిషత్ కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద కూడా చెట్టు విరిగింది. చిలుకూరు గ్రామంలో మామిడికాయలు నేలరాలాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. భారీగా వర్షం పడటంతో రోడ్లు బురదమయంగా మారాయి. గుంతల్లో నీళ్లు నిలిచి చిన్న కుంటల మాదిరిగా కనిపిస్తున్నాయి.



మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద విరిగిన చెట్టు

# గత సంవత్సరం సన్న వడ్ల కొనుగోళ్లకు బోనస్ రూ.1200 కోట్లు చెల్లింపు

## రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు

పరిగి, మే 15 : గత సంవత్సరం కొనుగోలు చేసిన సన్న వడ్లకు బోనస్‌గా రూ.1200 కోట్లు ఇచ్చామని, ఇంకా ఇవ్వాల్సి ఉందని, తప్పనిసరిగా ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. రాష్ట్రంలో పెద్దఎత్తున పంటలు పండాయని, ప్రభుత్వం సరైన ధరకు కొనుగోలు చేయడంతోపాటు రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలనే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. గురువారం పరిగి మండలం సుల్తాన్‌పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్.చౌహాన్, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌లతో కలిసి సీఎస్ రామకృష్ణారావు సందర్శించారు. ఈ సందర్భంగా వడ్లలో తేమ శాతం, వడ్ల కొనుగోలు వివరాలను సీఎస్ పరిశీలించారు. అనంతరం సీఎస్ మీడియాతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలుకు సంబంధించి పౌర సరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్ వచ్చి ప్రతిసారి రూ.500 కోట్లు, రూ.1000 కోట్లు కావాలని కోరుతుంటారని, డబ్బులు ఎక్కడికి పోతున్నాయని అడుగగా, మీరు క్షేత్రస్థాయికి రండి చూయిస్తానని చెప్పారన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాడిపత్రిలు, గోనె సంచులు, మంచినీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం ద్వారా ఎన్ని బస్తాలు వడ్లు కొనుగోలు చేశారని సీఎస్ అడుగగా 6850 బస్తాలు కొనుగోలు చేశామని డీసీఎంఎస్ ఇన్‌చార్జి వెంకటయ్య తెలిపారు. ఎన్ని రోజుల్లో ధాన్యం రావడం పూర్తవుతుందో తెలుసుకున్నారు.

### 46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

పరిగి మండలం సుల్తాన్‌పూర్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్.చౌహాన్ మీడియాతో మాట్లాడుతూ.. 2022-23 సంవత్సరంలో ఈ సమయానికి 20 లక్షల మెట్రిక్ టన్నులు, గత సంవత్సరం ఈ సమయానికి 30 లక్షల టన్నుల ధాన్యం సేకరణ జరిగిందన్నారు. గత సంవత్సరం కంటే 150 శాతం ఎక్కువ ధాన్యం కొనుగోలు పెరిగిందన్నారు. పెద్ద మొత్తంలో ధాన్యం వస్తుండడంతో అదనంగా టార్పాలిన్‌లు ఇవ్వడం జరిగిందని, రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చిన తర్వాత బాధ్యత అంతా తమదని, రైతులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. అవసరమైతే ఆటోమేటిక్ ప్యాడీ డ్రయర్ సైతం కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు నిర్భయంగా కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని చెప్పారు. వడ్లు కోతల సమయంలో వర్షాలపై ఎప్పటికపుడు రైతులకు సమాచారం అందిస్తున్నామని, వాటిని కాపాడేందుకు ఏదైనా ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మూడు రోజుల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



కొనుగోళ్లకు సంబంధించిన వివరాలు పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

వికారాబాద్ జిల్లాలో దొడ్డు వడ్లు ఎక్కువగా పండుతాయని, కుప్పల దగ్గరకు వెళ్లి తేమ శాతం పరిశీలించడంతోపాటు కొనుగోలు అనంతరం ధాన్యం తరలింపు, రైతులకు డబ్బులు పడ్డాయా అని తెలుసుకోవడం జరిగిందన్నారు. సన్న వడ్ల పరిమాణం తెలుసుకునేందుకు డిజిటల్ క్యాలిబర్ తెప్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్.చౌహాన్‌లను రైతులు, రైస్‌మిల్లర్లు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డీసీఎస్‌వో మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, తహసీల్దార్ ఆనంద్‌రావు, డీసీఎంఎస్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బిజినెస్ మేనేజర్ వెంకటరమణారెడ్డి, ఏపీఎం శ్యాంసుందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### కొడంగల్‌లో చీఫ్ సెక్రటరీ పర్యటన

కొడంగల్ : జిల్లా పర్యటనలో భాగంగా గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి కొడంగల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొడంగల్ ప్రాంతంలో వైద్య కళాశాల కోసం ఏర్పాట్లు చేస్తున్నందున ప్రస్తుతం కొనసాగుతున్న 50 పడకల ఆసుపత్రిని 220 పడకలుగా ఆసుపత్రి సామర్థ్యాన్ని పెంచుతున్న సందర్భంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. రోగుల వివరాలతోపాటు ప్రసవాల సంఖ్యపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి విద్యార్థినులు, సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలకు అల్పాహారం అందిస్తున్న హరే కృష్ణ సంస్థ కిచెన్ షెడ్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ ఆనంద్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ పద్మ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ, ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రప్రియ, మున్సిపల్ కమిషనర్ బలరామ్‌నాయక్, తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### సక్రమంగా పనిచేయాలి

వికారాబాద్ : ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలయ్యేలా అధికారులు పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ శాఖల పనితీరు, చేపట్టాల్సిన వివిధ అంశాలపై పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్.చౌహాన్, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌లతో కలిసి సమీక్షించారు. ఒక్క శాతం ఉన్న ఉద్యోగులుగా మనం 99 శాతం ఉన్న ప్రజలకు సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన అధికారులకు సూచించారు.

## ప్రజలకు అందుబాటులో ఉండి

# వైద్యసేవలందించాలి

### జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.వెంకటేశ్వర్‌రావు

షాబాద్, మే 15 : వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం షాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానను సందర్శించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రకాల వ్యాధులతో ప్రభుత్వ దవాఖానలకు వచ్చే ఏ ఒక్క రోగికి కూడా ఇబ్బందులు కలుగకుండా మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు.



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్ ప్రభాకర్‌రావు, వైద్య సిబ్బంది ఉన్నారు.

# గోజాతి పశువులను వధించొద్దు

### వికారాబాద్ ఏరియా పశుసంవర్థక, పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ పూర్ణచంద్రారావు



వికారాబాద్, మే 15 : బక్రీద్ పండగ సందర్భంగా ఎవరు కూడా గోజాతి పశువులను వధించరాదని వికారాబాద్ ఏరియా పశుసంవర్థక, పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ పూర్ణచంద్రారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో గల రైతు సోదరులు గోజాతి పశువులను అక్రమంగా రవాణా చేయించడం, వధించుట చట్టరీత్యా నేరంగా పరిగణించబడతాయని గుర్తుంచుకోవాలన్నారు. ఏదైనా గోజాతి పశువులను(ఆవులు, ఎద్దులు, కోడెలు) తదితర వాటిని రవాణా చేయాల్సి వస్తే సమీపంలో ఉన్న పశు వైద్యుల వద్ద రవాణా సర్టిఫికెట్‌ను పొందాలన్నారు. రైతులు పశువుల కొనుగోలుదారులు పశు వైద్యాధికారుత సూచనలు పాటించాలని కోరారు. పశువుల అక్రమ రవాణా జరగకుండా ముందస్తు జాగ్రత్తగా సంబంధిత శాఖల అధికారులతో కలిసి చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# కార్పొరేట్‌కు దీటుగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు

- ఆరుట్ల పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన సీఎంవో సెక్రటరీ అజిత్‌రెడ్డి



ఆరుట్ల పాఠశాలను సందర్శిస్తున్న సీఎంవో సెక్రటరీ అజిత్‌రెడ్డి

మంచాల, మే 15 : కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే రీతిలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయడం కోసం కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలంగాణ సీఎంవో సెక్రటరీ అజిత్‌రెడ్డి అన్నారు. గురువారం మంచాల మండలం ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా తీర్చిదిద్దడం కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ మురళితో కలిసి పరిశీలించారు.

అనంతరం ఆరుట్ల స్కూల్ డెవలప్‌మెంట్, మేనేజ్‌మెంట్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో సరిపడ మౌలిక వసతులు, నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నప్పటికీ విద్యార్థులు మాత్రం ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని.. అందుకే ఆరుట్ల పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో చదువుకునే విద్యార్థుల కోసం విశాలమైన భవనాలు, ఆటస్థలాలు, సీసీ రోడ్లు, స్వచ్ఛమైన తాగునీటితోపాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన చేయనున్నట్లు చెప్పారు. మంచాల మండలంలో 3 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, 4 తెలంగాణ ఫౌండేషన్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నందున విద్యార్థులు పాఠశాలలకు వచ్చేందుకు రవాణా సౌకర్యం కూడా కల్పించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ఎంతో మంది నేడు ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం సర్కారు అధిక నిధులు కేటాయిస్తున్నదని చెప్పారు.

కార్యక్రమంలో ప్రొఫెసర్ పద్మజారాణి, విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేశ్, జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, ఎంఈవో రాందాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌గౌడ్, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జంగయ్యగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎండీ జానీపాషా, గ్రామస్తులున్నారు.

# టాంపరింగ్ చేసి తరలిస్తున్నారు..!

- అసెంబుల్డ్ బోరు డ్రిల్లింగ్ వాహనాలకు ఇంజిన్, చేజ్ నంబర్ల మార్పు
- కోర్టును ఆశ్రయించి వాహనం రిలీజ్ ఆర్డర్ కూడా సృష్టిస్తున్న వైనం
- ఎలాంటి పత్రాలు, పన్నులు చెల్లించకుండానే విదేశాలకు వాహనాల చేరవేత
- టాంపరింగ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు

పరిగి, మే 15 : అసెంబుల్డ్ బోర్ డ్రిల్లింగ్ వాహనానికి ఇంజిన్, చేజ్ నంబర్లను టాంపరింగ్ చేసి మరీ వాహనం రిలీజ్ ఆర్డర్ తెచ్చుకున్న సంఘటన కలకలంరేపింది. 7 నెలల క్రితం లేని నెంబర్లు ఎలా వచ్చాయి, ఇందుకు ఎవరు సహకరించారనే విషయమై పలువురు అధికారులపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు వస్తున్నాయి. అసెంబుల్డ్ బోర్ డ్రిల్లింగ్ వాహనాన్ని ఎలాంటి పన్నులు చెల్లించకుండా, మూడో కంటికి తెలియకుండా విదేశాలకు తరలిస్తుండగా పరిగి పోలీసులు 2024 సెప్టెంబర్ 30న పట్టుకున్నారు.



డిపోలోని బోరు బండి

పరిగిలోని కొడంగల్ చౌరస్తా సమీపంలో పోలీసులకు అందిన సమాచారం మేరకు నంబర్ ప్లేట్ లేని బోర్‌వెల్ బండిని ఆపి పత్రాలు చూపించమనగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు విచారణ చేపట్టగా హైదరాబాద్‌లోని వనస్థలిపురం ప్రాంతంలో బోర్ డ్రిల్లింగ్ వాహనాన్ని అసెంబుల్డ్‌గా ఫిట్ చేసి ఎలాంటి పత్రాలు లేకుండానే పరిగి, కర్నాటక మీదుగా మహారాష్ట్రలోని ముంబై పోర్టు ద్వారా జాంబియా దేశానికి తరలిస్తున్నట్లు తేలింది. ఎలాంటి పన్నులు, జీఎస్టీ చెల్లించకుండా, ఎగుమతులకు సంబంధించిన పన్నులు సైతం ఎగవేసి అసెంబుల్డ్ బోర్ డ్రిల్లింగ్ వాహనాలను జాంబియాకు తరలించడం వెనకాల అసలు ఎవరున్నారనేది తేలాల్సి ఉండగా ఈ వాహనాన్ని పరిగి పోలీసులు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు. అప్పటినుంచి పరిగిలోని ఆర్టీసీ డిపోలో ఈ వాహనాన్ని ఉంచారు. ఇదిలావుండగా ఇటీవల ఆర్టీసీ డిపోలో గల వాహనం చేజ్, ఇంజిన్ నంబర్లనే మార్చివేశారు. దీంతోపాటు వాహనానికి అన్ని పత్రాలు ఉన్నాయంటూ కోర్టును ఆశ్రయించి రిలీజ్ ఆర్డర్ పొందారు. ఈ విషయం ఈనోటా ఆనోటా బయటకు వచ్చింది. టాంపరింగ్ చేశారంటూ పరిగి పోలీసులు మే 5న కేసు నమోదు చేయగా, ఇప్పటివరకు ఏ వివరాలు బయటకు చెప్పకపోవడం గమనార్హం. ఆరు నెలల క్రితం బోరుబండిని సీజ్ చేసిన పోలీసులు వాహనాన్ని డిపోలో ఉంచే సమయంలో ఎలాంటి సీజింగ్ లెటర్ ఇవ్వలేదని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. డిపోలో ఉన్న వాహనం ఇంజిన్, చేజ్ నంబర్ ఎలా మారిందనేది ప్రశ్నార్థకంగా తయారైంది. ఈ విషయమై పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా.. కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.